# ఆనంద బాష్పాలు

ఆగష్టు 15.

జాతీయ పతాకం ఆకాశంలో రెపరెపలాడుతూవుంది.

పోలీసు గ్రౌండ్‌లో పెరేడ్ జరిగింది.

పిల్లలందరికి చాక్‌లెట్లు పంచారు.

ఒకటీ రెండూ!

ముప్ఫైఏళ్ళక్రితం కడుపునిండా ఆకలి. రెండు చాక్‌లెట్లు!

రెండు చాకులెట్లు తింటే ఆరిపోతున్న ఆకలికి మళ్ళీ కట్టెలు పెట్టి మంట రాజేసినట్లే.

రవి తినలేదు. తినలేక వాంతి చేసుకొంటున్న సుధకు ఇచ్చాడు.

స్కూలులో, గవర్నమెంటు బిల్డింగ్స్‌కీ, క్లాక్‌టవర్‌కీ, పోలీసు గ్రౌండ్స్‌లో రంగు కాగితాల తోరణాలు కట్టారు.

పట్టణం అలంకరించుకొంది.

రవి చిరిగిన బట్టల మాసికలు కనిపించకుండా శరీరం అడ్డం పెట్టుకొని నడుస్తున్నాడు.

పట్టణం అంతా లౌడుస్పీకర్లు మ్రోగుతున్నాయి.

వందేమాతరం పాడుదాం అని రవి గొంతెత్తితే శబ్దం రాలేదు. సుజలాం సుఫలాం అందామని చూస్తే గొంతు కదల్లేదు. జనగణమన అందరూ పాడుతుంటే ఆపురమని ఏడుద్దామనిపించింది.

పట్టణం లౌడ్‌స్పీకరై మ్రోగుతూవుంది.

పగలంతా కార్లు, జీపులు, వేనులు, లారీలు, కొబ్బరి మట్టలు కట్టుకొని జాతీయ పతాకాలు పుచ్చుకొని, రంగు కాగితాలు భుజాన వేసుకొని ఊరంతా తిరుగుతూనే వున్నాయి.

రవి ఒక లారీలో ఊరంతా తిరిగాడు. ఆకలి కొంచం తగ్గింది. చెవులు దిబ్బళ్ళు తగ్గాయి.

రాత్రి బాణాసంచా కాల్చారు. పట్టణం అంతా పొద్దు పోయిందాకా తిరిగి తీరుబడిగా ఇంటికి చేరాడు.

అమ్మా నాన్న తమ్ముడు తన కోసం ఎదురు చూస్తుంటే సిగ్గుపడ్డాడు. కొడుకు ఇంటికి వస్తే తిండి పెట్టలేక తల్లి కుంచించుకు పోయింది.

కూలి డబ్బులు చేతికిరాక ఆకలిని గుమ్మం అవతల నిలబెట్టి తండ్రి లోపలికి వచ్చి ఇల్లు అంతా చూచి బాధపడి మూలకు చేరగిలబడి వున్నాడు.

ఇవాళ సంగతి ఇంతే కాబోలునని రవి తమ్ముడు నిద్ర ఎందుకు మాను కోవాలని తీవ్రంగా కుస్తీ పడుతున్నాడు. తల ఎత్తుతున్నాడు. సరిగ్గా జరిగి కూర్చుంటున్నాడు. చివరికి నిద్రలోకి జారిపోయాడు. అమ్మవడిలో, నాన్న నానుకొని.

రవి అమ్మదగ్గరకు చేరాడు తల నిమిరింది. నిద్రపొమ్మనలేదు కాని అర్థం అంతే. అన్నం లేదనలేదు కాని అర్థం అంతే.

మనిషి అస్తిత్వం కంటే ఆకలి అస్తిత్వం సత్యం.

రవి ఉన్నాడన్నా లేడన్నా ఎవరికీ తెలియదు కాని రవికి ఆకలి లేదంటే మాత్రం వీలులేదు. ఉందని వెంటనే రవి తేల్చి చెప్పగలడు.

కడుపు దాని ఉనికిని మర్చి పోనీయకుండా గుర్తు చేస్తుంటే రవి లేచిపోయి నీళ్ళు తాగి త్రేనుస్తూ వచ్చి అమ్మను చుట్టుకొని పడుకొన్నాడు.

రాత్రి గొప్పది. నిద్ర మరీ గొప్పది.

చాలా బాధలకు మందు నిద్ర. రాత్రి పరిష్కారం.

రవి పస్తు ఫారంలో చేరాడు.

రెణ్ణెల్ల క్రితం

వాడికి చదువెందుకు ఏదో పని పాటా చేసుకుంటే చేతికి అండగా ఉంటా డని ఎవరో సలహా ఇవ్వక పోలేదు.

తండ్రి వినలేదు. తల్లి ఒప్పు కోలేదు.

ఆ ఏడే తమ్ముడు కూడా ఒకటో తరగతిలో చేరాడు.

వాడికేం తెలియదు. ఎక్కాల పుస్తకం చించేసాడు. పలక పగలకొట్టాడు. బలపం విరగకొట్టాడు.

అలా చేయకూడదురా అంటే నాలిక మూరపొడుగు వెలుపలికి లాగి చేయి ఊపినట్లు ఊపి వెక్కిరిస్తాడు.

వీడిదెంత పెద్ద నాలుకో !

'వీడికి చదువు బాగా వస్తుంది' అనేది మార్తమ్మ టీచరు.

'వాడికి ఆకలి ఎక్కువరా' అనేది అమ్మ.

'రెండూ నిజమే' అనేవాడు తండ్రి.

తల్లితండ్రి కూలి నాలీ చేసి పిల్లలిద్దర్ని పెంచటమే కాదు, చదివించటం కూడా ఆరంభించారు.

వాళ్ళిక పిల్లల్ని వద్దే అనుకొన్నారో, పుట్టనే లేదో కాని మళ్ళీ సంతానం కలగలేదు.

రెక్కలు ముక్కలు చేసుకొని, ఆ ముక్కలకు ధనం సంతానమై పుడుతుంటే వాళ్ళు వదులుకో లేదు.

కూలీ కూడా భాగానే ఉండేది.

ఖర్చులు పోగా నెలకు పదో పరకో వెనకేసుకో సాగారు.

పిల్లల చదువు బాగానే సాగుతూ వచ్చింది.

పదికి పది తోడు చేసుకొని ఒక ఎకరం పొలం కొనుక్కొన్నారు వాళ్ళు.

పొలం సొంతంది ఉంది, అనే ఆనందం ఇద్దరికీ అంతులేకుండా కలిగింది.

వాళ్ళు మళ్ళీ ఏ ఆగస్టు 15 న కూడా ఆకలి కడుపులకు వళ్ళుదానం చేసి నిద్రకు శరీరాలప్పగించలేదు.

వాళ్ళ కాపురం కలిసివచ్చింది. ఎకరం రెండెకరాలయింది. రవి యస్.ఐ. ఉద్యోగంలో చేరిన రోజుల్లోనే తమ్ముడు స్కూల్ మాష్టరుద్యోగంలో ప్రవేశించాడు.

ఇవాళ ఉదయం తమ్ముడు సూర్యోదయం కాకముందే స్వీట్‌స్టిన్ తీసుకొని స్కూల్‌కుపోయాడు.

రవి సెరిమోనియల్ డ్రస్ వేసుకొని పోలీసు గ్రౌండ్స్‌లో పెరెడ్ కమాండ్ చేయటానికి చీకటిని హేట్ మీద పెట్టుకొని వెళ్ళాడు.

రవి పిల్లలిద్దరూ, తమ్ముడి పిల్లలిద్దరూ టిఫిన్ చేసి బూట్సువేసుకొని టక్ చేసుకొని, టైకట్టుకొని బయలుదేరుతుంటే రవి పెద్ద కూతురు లంగా జాకెట్ రిబ్బన్లు మూడూ.... మూడు రంగులని జాతీయ పతాకం రంగుల్లా రెపరెపలాడు కొంటూ ఎగురుతూ దూకుతూ సిద్ధమయింది.

పెరడ్ కమాండ్ చేయటం ఎలా వుంటుందో చూద్దామని ఆడవాళ్ళిద్దరూ సిద్ధమయి బయలుదేరారు.

ఎక్కడికి పోయే పని లేకుండా తీరుబడిగా చుట్టకాలుస్తున్న భర్తను చూస్తూ రవి తల్లి కూర్చుంది.

స్కూలులో స్వీట్‌లు పంచుతుంటే ఎగబడ్డ పిల్లలతో 'నేను పంచనురా మీరే పంచుకోండి' అని చెప్పి అలిగి కూర్చున్నాడు రవి తమ్ముడు.

అల్లరి చేయమని పిల్లలు బ్రతిమాలుతున్నారు.

ప్రొద్దునే చలికి పెగలని గొంతును సవరించుకొంటూ కమేండింగ్ ప్రాక్టీసు చేస్తున్నాడు రవి.

పోలీసు కంటింజెంట్ సిద్ధమవుతూ ఉంది.

స్కూలులో తమ్ముళ్ళకి స్వీట్ ఇప్పించి అందరకి సమంగా పంచి తాను పెద్దది కాబట్టి ఒకటి ఎక్కువ తీసుకొంది రవి పెద్ద కూతురు.

'పిల్లి కోతి కథ' అని ఏడిపిస్తున్నాడు చివరివాడు.

రవి భార్య, మరదలు పట్టుచీరెలు రెపరెపలాడించుకొంటూ పోలీసు గ్రౌండ్స్ వద్ద రిక్షాదిగారు.

ఎనిమిది గంటలు కావస్తూవుంది.

జనం నెమ్మది నెమ్మదిగా వస్తున్నారు. ఆడవాళ్ళు వాళ్ళకు అంతా కన్పించే చోట తీరుబడిగా కూర్చున్నారు.

తమక్లాసు పిల్లల్ని క్యూలో నడిపించి తీసుకువచ్చే అయ్యవార్లలో రవి తమ్ముడు హంగామా చేస్తూవున్నాడు.

తమతమ క్లాసు పిల్లల్లోక్యూలో నిలబడివున్నారు అన్నదమ్ముల పిల్లలు.

అంతా పోలీస్ గ్రౌండ్స్‌లో ఇండిపెండెన్స్‌డే పెరేడ్‌కి సిద్ధంగా వుంది.

కలెక్టర్ వచ్చాడు.

పిల్లలు చప్పట్లు కొట్టారు.

పెద్దవాళ్ళు మర్యాదచూపారు.

తొమ్మిది గంటలు. అంతా నిశ్శబ్దం.

పోలీసు గ్రౌండ్స్‌లో పెరేడ్ కమాండర్ రవి 'సావధాన్' అని అరిచాడు.

చుట్టూ మైలు దూరం ప్రతిధ్వని.

ఇది రవి గొంతుల్లోంచి, పేగుల్లోంచి, అంత స్నాయువుల్లోంచి వచ్చిన ధ్వని.

పూర్వం నుంచి గొంతు పెగిలిరాని ధ్వనికిదే పరిష్కారం.

కలెక్టరు జాతీయ పతాకం ఆవిష్కరించాడు.

పెరేడ్ అయిపోయింది స్కూలు పిల్లలు ఇళ్ళకు బయలు దేరారు.

వాళ్ళ సంరక్షకులు, టీచర్లు అందరినీ సాగనంపి వాళ్ళు వెళ్ళారు.

పెరేడ్ చూడ్డానికి వచ్చిన వాళ్ళు వెళ్ళి పోతున్నారు.

పెరేడ్ చాలాబాగా కమేండ్ చేశానని అందరూ అభినందిస్తుంటే కృతజ్ఞత తెలుపుకుంటూ రవి వెలుపలికి వచ్చాడు.

ఇంటికి వచ్చేసరికి అందరూ భోజనానికి సిద్ధంగా వున్నారు.

పలావ్‌హాట్ హాట్‌గా వుంది. రవికి బాగా ఆకలి అవుతూవుంది.

పిల్లలతో, తమ్ముడితో, తనూ భోజనానికి కూర్చున్నాడు.

కడుపులో విపరీతంగా ఆకలి.

ఇటువంటిదే ఆకలి! ముప్పైఏళ్ళ క్రితం! భారతదేశం రిపబ్లిక్ అయిన తర్వాత! మొదటి స్వాతంత్ర దినోత్సవంనాడు.

ఇవాళ ఆకలిని అణచివేయగలిగినంత అన్నం.

ఆకలి మంట చల్లారడానికి ముప్పై ఏళ్ళు పట్టింది.

అన్నం నోట్లో పెట్టుకొంటుంటే రవి కళ్ళ వెంట నీళ్ళు.

'కారమా' భార్య అడిగింది.

'రుచి లేదా' మరదలు అడిగింది.

'అదేంకాదు!' రవి చెప్పాడు.

'మరేం?' తండ్రి అడిగాడు.

రవి చెప్పాడు 'ఆనంద బాష్పాలు.'

రవి భోజనం చేస్తున్న పిల్లల్ని చూశాడు.

పోలీస్ గ్రౌండ్స్‌లో పెరేడ్ మార్చింగ్ లాగావుంది.